# మద్రాస్ టు తిరుపతి

––నిడదవోలు మాలతి

**א**

''తిరుపతుకు మూణు టికెట్ వేణుం'' అంది నాజుగ్గా ఉన్న నాతి నట్టుతూ.
తెలుగు పడుచని పోల్చినట్టున్నాడు డ్రైవరుసీట్లో సుఖాసీనుడై ఉన్న క్లీనరు, ''కూసోండి, కండక్టరు ఇప్పుడుదా వచ్చును'' అన్నాడు తన కొచ్చిన తెలుగులో.
ముగ్గురాడపిల్లలూ మురిసిపోయారు రిజర్వేషను లేకుండా సీట్లు దొరికినందుకు. కిలకిల్లాడుతూ సర్దుకున్నారు.
బస్‌వరకూ ఇంచుమించు బురదలో ఈత కొట్టుకుంటూ రావడంచేత బస్‌లో పడగానే హాయ్‌హాయ్‌మనిపించింది ప్రాణం.
వాన కూడా శోభాయమానంగానే ఉంటుందనిపించింది. ఆమాటే అంది నాజుగ్గా శలాకలా ఉన్న పిల్ల దోసపండులాటి పిల్ల,

పక్కనున్న పాలతితో.

''ఛూ. నాకు వానంటే మహా చిరాకు'' అంది దోసపండు.

వెనక సీట్లో కూచున్న ఆసామీ పక్కనున్న తన స్వామినితో ''బాలాజీ ఎక్స్‌ప్రెస్‌లో పూడుస్తుం అంటే వింటివా?'' అంటూ దెప్పుతున్నాడు.

''ఏవిటో వీళ్ళ భాష. బతికుండగానే మనుషుల్ని పూడ్చేస్తారు.'' అంతవరకూ వింతగా చూస్తున్న మూడో అమ్మాయి ప్రకాశంగానే స్వగతం పలికింది.

ముందు సీట్లో వున్న మొదలియారు కిటికీ కమ్మీలకి మొహం ఆనించి తుపుక్కున ఉమ్మాడు. కిటికీ దగ్గిర కూచున్న అమ్మాయి తృళ్లిపడింది తన మీద తుప్పర్లు పడకపోయినా. ఇదే ఫారిన్లో అయితే ఎలా ఉంటుందో ఊహిస్తోంది ఆ అమ్మాయి.

బస్సు కదిలిం తరవాత కూడా ఇలాగే ఆ మనిషి తుపుకూ తుపుకూ ఉమ్మితాడేమో భగవంతుడా అని బెదిరిపోతూంది.

చటుక్కున ఆడో మగో తెలీని నాలుగు శాల్తీలు గలగల్లాడుతూ బస్సెక్కి వెనక సీట్లో సర్దుకున్నాయి.

''కాలీజీలు మూసీసీరు గావాల. ఇళ్ళకెల్త న్నారు గావాల'' పెద్దాయన అబ్సర్వు చేశాడు.

''గోయింగ్ ఫరె పిక్నిక్'' అందో అన్నాడో అందులో ఓ మనిషి.

''ఈ వానా, బురదా, ఈదురుగాలిలో పిక్నిక్కేవిటి నామొహంలా'' అంది కిటికీదగ్గిర కూచుని, సుమారుగా మొహం బాగానే ఉన్న చిన్నది, ఆమొహమే వికృతంగా పెట్టి.

బస్సు బయల్దేరితే బావుణ్ణు అనుకుంటున్నాడు అప్పుడే బస్సెక్కిన బిజినెస్ మాగ్నెట్.

కండక్టరు రాయవలసిన చిట్టా ఆవర్జాలన్నీ రాసి, టిక్కెట్లు లేనివాళ్ళకి టిక్కెట్లిచ్చి, ఉన్నవాళ్ళవి చెక్కేసి, ''రైట్'' అన్నాడు.

డ్రైవరు తలుపు తీసె, బస్ దిగి, తలుపు వేసి, నేరుగా వెళ్ళి జేబులోంచి పర్సు తీసి, డబ్బు తీసి, పర్సు జేబులో పెట్టుకుని, కాఫీ అడిగి, తీసుకుని, తాగి, కప్పు వాపసు చేసి, బస్సుదగ్గిరకొచ్చి, జేబులోంచి అగ్గిపెట్టె తీసి, బీడీ తీసి, బీడీ

వెలిగించి, అగ్గిపెట్టె జేబులో పెట్టుకుని, బీడీ పళ్ళమధ్య గిట్టకరిచి పట్టుకుని, తలుపు తీసి, సీట్లో సుఖాసీనుడై, తలుపు సరిగ్గా పడిందో లేదో మరోసారి చూసుకుని స్టార్టు చేశాడు.

బస్సులోని జనం అంతా ఆక్షణం కోసమే ఎదురుచూస్తున్నారు. అందరూ కూడబలుక్కున్నట్టు ఓ దీర్ఘమైన నిట్టూర్పు విడిచారు.

ముందుసీట్లో కూచున్న మొదలియారు మళ్ళీ కాండ్రించి ఉమ్మేశాడు. కిటికీ దగ్గిర అమ్మాయి మళ్ళీ తుళ్ళిపడింది.

కిటికీకున్న గాజుతలుపు వేసే ఉంది.

పిక్నిక్కుకి బయల్దేరిన కుర్రకారు పేకలూ, పత్రికలూ తీశారు.

యాత్రకి బయల్దేరిన ముసలావిడ వక్కముక్క నవుల్తోందో, గోవిందనామాలు వల్లించుకుంటోందో సరిగ్గా తెలీడంలేదు.

బిజినెస్మాగ్నెట్టు నాలుగు ఉంగరాలూ నాలుగువేళ్ళమీదా మెరుస్తుండగా స్టేట్స్మన్ వెలిగించేడు. ఆయన వెనక సీట్లో ఉన్న ఓ పడుచు మొహం చిట్లించి మౌనంగానే బస్సులో ఆయన అలా పొగ తాగడాన్ని నిరసించింది. అది గ్రహించిన, ఆమెపక్క నున్న మగాయన ముందుకి వంగి, ''బస్సులో సిగరెట్లు కాల్చకూడదండీ'' అన్నాడు.

బిజినెస్మాగ్నెట్టు నిర్లక్ష్యాన్ని సూచించే ధ్వనొకటి చేసి, ''అటు చూడు'' అన్నాడు డ్రైవరునీ, అతని నోట్లో వెలుగొందుతున్న బీడీని చూపిస్తూ.

''మీరేవుందండీ. ఇటెక్కుతారు. అటు దిగడిపోతారు. మేం ఇరువై నాలుగ్గంటలూ ఈ బస్సులోనా సావాల. మాకా మాత్తరం బీడీ ముక్కయినా కాలిసే రయిటు నేకపోతే ఎట్టాగండీ'' అన్నాడు కండక్టరు ట్రేడ్యూనియన్ భాష మాటాడుతూ.

''అయితే మాత్రం ఏం? ఆయన కాల్చే బీడీకి పొగ రాదా? లేక ఆ పొగ శృంగారబత్తీ వాసనొస్తుందా?'' ఓ స్టూడెంటు కుర్రాడు తను కూడా ఓ సిగరెట్ తీసి వెలిగిస్తూ లాపాయింటు లాగేడు. ముందు వరసలో ముగ్గురూ నవ్వేరు. అభ్యంతరం చెప్పిన ఆడమనిషి భర్తచేతిమీద చెయ్యేసి, ''మీరూరుకోండి'' అంది అనునయంగా. ముందు ముట్టించిన బిజినెస్మాగ్నెట్టు నిర్వికారంగా కిటికిలోంచి చూస్తూ కూచున్నాడు.

బస్సు ఆగిపోయింది.

ఎందుచేత?

వాగొచ్చిందిట

ఇంతకు మునుపు కూడా వాగులొచ్చేయి.

ఇది చాలా లోతుగా ఉన్నట్టుంది.

''చూడవోయ్! పొగరుమోతుగిత్తలా పరవళ్ళు తొక్కుతున్న పిల్ల కాలువ. దూరంగా సచేల స్నానం చేసి వణికిపోతున్న పునిస్త్రీలా'' తెలుగుపడుచు శలాకలాటి పిల్లతో అంది.

ఆ అమ్మాయి మొహం చిట్లిస్తూ, ''నాకలాటివి తెలీవు'' అంది.

తమిళ దేశంలో స్థిరపడిన తెలుగువెలుగు ఒకాయన ''మనము తిరుపదికి ఎప్పుడు పూడుస్తుమో'' అని వాపోతున్నాడు.

బి.మాగ్నెట్ వెనక కూచున్న భర్త భార్యకి భోధిస్తున్నాడు, ''వానొస్తే వాగులొస్తాయి. వానొచ్చినా, రాకపోయినా లెవెల్ క్రాసింగులొస్తాయి. అన్ని పరిస్థితుల్లోనూ బస్సులాగిపోతుంటాయి.''

‘‘స్పీడు బ్రేక్రరులంటే అవేనా? ఇన్ని అడ్డంకులుండగా, మనకి వేరే స్పీడు బ్రేకరుల అవుసరం ఉందా’’ అని అమాయకంగా ప్రశ్నిస్తోంది భార్య.

‘‘అయితే ఈ బస్సు ఈరాత్రికి ఇక్కణ్నుంచి కదల్దా?’’ పండులా ఉన్న అమ్మాయి బెంగ పడుతూ అడుగుతోంది.

‘‘మరి, మనం ఎలా వెళ్తాం?’’ ఎవరో ఎవర్ని ఉద్దేశించో తెలీకుండా అడుగుతున్నారు.

‘‘అయ్యో. నాకు లీవు కూడా లేదు. రేపు ఆఫీసుకి ఎటెండు కాకపోతే జీతం తెగ్గోసేస్తారు.’’

‘‘ఎన్నప్పా? ఇణ్ణికుదా పోప్లామా, ఇల్లియా?’’

‘‘డయివరయ్యోవ్! రోడ్డుండాది గాదా. నెమ్మదిమీన పోదా బండి?’’

‘‘నాదేవుంది బాబూ! ఇడవమంటే బ్రేకులిడిసిస్తాను. అందరం పోతాం గంగలోకి’’

‘‘ఆఫ్టరాల్, పబ్లిక్‌సర్వెంటు! ఎంత పొగరుగా మాటాడుతున్నాడు’’ అన్నాడు స్టూడెంటు కుర్రాడు.

‘‘అవును మరి. అందరూ ఏంచేస్తావు, ఏంచేస్తావంటూ మాట తోచనియ్యకుండా చంపుకుతింటుంటే,’’ అన్నాడు మరో కుర్రాడు.

ఈ బస్సు ఇవాల్టికి కదలదు కాబోలు.

‘‘బాలాజీ ఎక్స్‌ప్రస్‌లో పూడుస్తుం అంటే వింటివా?’’

యాత్రకే బయల్దేరిన ముసలావిడ, ‘‘వెళ్తున్నది పుణ్య క్షేత్రం. భగవంతుడు అరాచకాన్ని సహించడు. ఆపద మొక్కులు, సంపద మరుపులన్నారు. మర్చిపోయిన మొక్కులేవేనా వుంటే గుర్తుకి తెచ్చుకోండి తండ్రులారా’’ అని బ్రతిమలాడసాగింది.

‘‘ఓ తడవ మాంవిట్టాగే బదరాసెలంఎల్తావుంటే బండి ట్రబులిచ్చీసినాది నడిదారిల. ఆరేతిరి అక్కడ్నే అయిపోనాది. సుట్టుపక్కల ఓటెళ్ళు గూడా నేవు. సరి. పల్లెలోకెల్లి రొండు కుండలూ, అయిస్సేరులు బియ్యం అట్టుకొచ్చినాం. బండిలోనే ఇద్దరాడామెలుండిరి. వాల్లు ఒంట సేసెట్టినారు.’’

ముగ్గురమ్మాయిలు మొహాలు చూసుకున్నారు. మూడో అమ్మాయి రహస్యంగా అడిగింది, ‘‘మనల్ని ఇప్పుడు వంట చెయ్యమనరు గదా’’.

మొదటి అమ్మాయి జవాబు చెప్పింది, ‘‘వండమన్నావు, వండుతున్నాను నాబుద్ధికి తోచిన వంట’ అని పాడితే సరి’’.

బి. మాగ్నెట్ అడిగాడు, ‘‘మరోదారి లేదా?’’

‘‘రూటు మారిస్తే రూల్సొప్పవండీ’’ అన్నాడు డ్రైవరు.

‘‘బావొందయ్యోవ్. పేసింజర్లని ఇట్టా బాదలెట్టడాని కొప్పుతాయేటి నీ రూలుసు’’ భద్రాచలం ట్రిప్పు వివరిస్తున్న మనిషి కసిరేడు చనువుగా.

"Shall we go ahead with our picnic plans on the roadside in the dim reflections of the car headlights?"

"ఛీ, ఛీ, ఇండియాలో బస్సెక్కడం అంత న్యూసెన్సు మరొకటి లేదు’’

‘‘బావుంది. మెడ్రాస్ నించి తిరుపతికి వెళ్ళాలంటే బస్సు ఇండియాలో ఎక్కాలి గాని, లాసాంజలెస్‌లోనో మెల్బోర్న్‌లోనో ఎక్కుతారా ఏం?’’

ఆ ఒడ్డున బండేదో వస్తున్నట్టుందే!

రావటం లేదయ్యా. అదావొడ్డున చిక్కడిపోయింది.

ఉండండి. చూదాం. అదిటొస్తే మనవూ అటెళ్లొచ్చు.

''అల్లూ మన్లాగే సూత్తునారేవో''

ఆ. ఆ. కదుల్తున్నట్టుంది.

ఆహా. కదలకేం? కదుల్తోంది, వెనక్కి. మిస్టర్ డ్రైవర్, మరలించవోయ్ మన రథం కూడా''

మళ్లీ మెడ్రాసుకే!!

మొక్కులెవరికేనా వున్నాయేవో యాదకొచ్చేయా?

తడ మీదుగా పోనీయవోయ్ బాబూ, ఒక్కరోజు లీవు పెట్టుకుని వచ్చాను..

యస్యస్. వయా తడ, డోంట్ స్పాయిలవర్ పిక్నిక్.

పెట్రోలు సాలదండీ.

ప్రభో! తడమించి కాకపోతే కొచ్చిన్‌మించి తీసుకెళ్లు. ప్రయాణం పెట్టుకున్న ప్రారబ్ధానికి మేవిచ్చుకుంటాం ఆ ఖర్చులు.

అరె, కదుల్తున్నట్టుందే!

వెనక్కి.

ఆగాగు. ఆ వొడ్డునున్న బస్సు వస్తున్నట్టుంది.

ముందు మోకాలు నీళ్ళలో నానుతున్న ఈ బస్సుని ఒడ్డెక్కనీ.

ఈ బస్సుని నమ్ముకునీ కన్న నడిచిపోతే, ముందు చేర్తామేమో.

సరే. నువ్వు దిగి నడుస్తూండు. ముందెళ్ళిపోతే మాకోసం బస్టాండులో వెయిట్ చెయ్యి. దారిలో బస్సు తగిల్తే బస్సెక్కుదువు గానీ.

ఆమాత్రం దానికి నడవడం ఎందుకు?

కదలిక చైతన్యానికి, అంటే ప్రగతికి చహ్నం. ఒక్కోసారి ఆ కదలిక ఆత్మ ప్రదక్షిణకి మించకపోయినా, కదుల్తున్నాం అన్న తృప్తి నిస్తుంది.

అమ్మా! మీరు ముగ్గురూ రూపాయిన్నర ఇవ్వండి. అయింబదు పైసా కొడప్పా!.

నిండా మోసంగా ఉండాది. ఆరు రూవా ఇచ్చి అర్థ రూవా వడ్డీ. అర్త రేత్తిరి వీడు సేరేది.

నాన్ చెప్పిడిస్తిని గదా బాలాజీ ఎక్స్‌ప్రెస్ల పూడుస్తుం అని

ఈడనే ఏడయ్‌పోనాది.

డ్రైవరు కండక్టరుతో చెబుతున్నాడు, ''మనమీద రాకండ రిపోర్టు రాయి. గరదయ్యపాలెం వద్ద పెద్ద వాగు వచ్చుట వలన బండి తడ మీదుగా మరలించడమైనది అని. పేసింజర్ల కాడ చేవ్రాలు తీసుకో.''

''అర్తరూపాయి ఇస్తిమి గద. మల్లీ ఏమి తీసుకోమంటడు?''

నువ్వు గమ్మునుండు. దస్కతు అడగతన్నడు.

డ్రైవరు లైటు తీసేశాడు. బస్సులో తమసు. మనసులో దిగులు. పేసింజర్లు అమ్మ కోసం బెంగపడ్డ పిల్లల్లా కూచున్నారు.

కిటికీ దగ్గిర కూచున్న సుకుమారప్పిల్ల సిగరెట్ పొగలు భరించలేక గాజు తలుపు పైకెత్తింది. ముందుసీట్లో ఉన్న మొదలియారు తలుపు దగ్గిరకెళ్ళి నోట్లో ఉన్న మొత్తం కిళ్లీ బయటికి ఉమ్మేసి వచ్చి కూచున్నాడు.

చీకట్లో కూడా మెరుస్తున్న రాళ్లు గల, ఉంగరాలు గల, చేతులు గల, బిజినెస్ మాగ్నెట్ సిగరెట్ వెలిగించబోయి, ఓ మారు వెనుదిరిగి చూసి మళ్లీ మనసు మార్చుకున్నాడు. ఆయన వెనకనున్న ఆడమనిషి, పాపం, ఆయన సిగరెట్ కాల్చుకుంటే నేనేమీ అనుకోను అనుకుంటోంది.

కండక్టరు అపాలెజిటిగ్గా నవ్వి, ''ఎల్లిపోతాంలెండి'' అన్నాడు ఓదార్పుగా, ఆడపిల్లలకి అభయహస్తమిస్తూ.

''ఈరాత్రికే వెళ్లిపోగలం అంటావా'' ఆవెనకనున్న, ఒక్కరోజే లీవు పెట్టుకు వచ్చిన ఉద్యోగి ఆతృతగా అడిగాడు.

''ఆ! వెల్‌పోతాం'' అన్నాడు కండక్టరు మళ్లీ.

''తడ పోయిడిసిందా?'' యాత్రకి బయల్దేరినావిడ భర్తనడుగుతోంది.

''బాలాజీ ఎక్స్‌ప్రెస్లె వూడిస్తే, ఈసరికి కొండపైన పోదుం'' అడిగిన ప్రశ్నకి కాకుండా సమాధానమిచ్చాడు అతను.

''కడ అంటే ఏమిటో'' కిటికీ దగ్గిరున్న అమ్మాయి పక్కనున్న, పండులాటి అమ్మాయిని అడిగింది.

''కడ కాదు. తడ'' అందా పిల్ల.

''నేనడుగుతున్నది అది కాదు. సినిమా పోస్టరుమీద 'కడ' అని రాశారు. అదీ''

''కడ అంటే ఆఖరు అని అర్థం. రేపటితో బొమ్మ మారిపోతుందన్నమాట''

టైమెంత?

ఎనిమిదీ నలభై.

ఎట్టుమ్ముక్కాల్.

నా వాచీలో ఎనిమిదీ యాభై అయిందే!

''సరేలే. ఈ ముసుర్లో ఈ బస్సులో ఎంతైనా ఒకటే. సుమారుగా ఎంతై ఉంటుందని అడిగాను. వేలంపాటలా అందరూ తలొక టైమూ చెప్తున్నారు.''

అసలే బోరు కొట్టి ఛస్తున్నాను. నీ నీతిపాఠాలు కూడానా?

మరి నువ్వు నీఇల్లాలి ముచ్చట్లాపకపోతే...

శ్రీకాళహస్తీశ్వరస్వామి సన్నిధికి చేరుకున్నాం. ఎవరైనా కావలిస్తే ఇక్కడ భోజనాలు చేయండి.

అప్పుడే నైన్ ఫిఫ్టీన్.

అయ్యో! కండక్టరుగారూ, నేనర్జంటుగా తిరుపతి పోవాలి. నెల్లూరినించి వస్తున్నా. ఆఏరుకాడ మా బస్సాగిపోయింది. బస్లు పోవటంలేదు.

మరి ఈ బస్సు మాత్రం పోతుందా?

నిజంగా బస్సులు పోటంలేదా?

ఆపదమొక్కులవాడా!!!

''నిజవయ్యా బాబూ! ఏరుకాడ ఆ ఒడ్డున బండ్లు ఆ ఒడ్డునా, ఈ ఒడ్డున బండ్లు ఈ ఒడ్డునా నిలిసిపొనాయ్–ఎదుర్కోల మాదిరి. నాన్నడిసొచ్చినా. బస్ తొరగా పోనీ. తొమ్మిదిముక్కాల్వండీకయినా అందుకుంటాం.''

‘‘ఉండండి, కండక్టరుగారూ, రొండు మెతుకులు గతికొస్తాం.’’

‘‘బండి పోద్దయ్యా!’’

‘‘ఉండవయ్యా నీగోల – ఇప్పుడొచ్చి. నిన్నట్నుంచి నానా అవస్థ పడుతున్నాం మేం.’’

‘‘మీరు దిగి, తీరిగ్గా భోంచేసి ఈడ్నే పండుకుని, తెల్లారి లేసి పొండి. బండికి పోయేవోళ్లని ఆడ వొదిలీసొస్తాం.’’

‘‘సుట్టుతిప్పి తీసుకొచ్చేడని అర్థ రూపాయి ఎక్కువిచ్చి సగందారిలో దిగిపోడవా?’’

ఈకథలో నీతి: మెడ్రాసులో బస్సు ఎక్కితే కాళహస్తిలో రైలెక్కే అవకాశాలుంటాయి. ఇంతే సంగతులు.

★★★

( ఆంధ్రసచిత్ర వారపత్రిక, జూన్ 1, 1973, లో ప్రచురితం)